ఖానాపురం: పాకాల ఆయకట్టులో నీటమునిగిన పంట పొలాలు

చెన్నారావుపేట: జల్లిలో గాలివానకు కొట్టుకుపోయిన ఇంటి పైకప్పు

నర్సంపేటలో ఇంట్లోకి చేరిన నీరు

రైతన్నకు ఊరట

- జిల్లాలో 5.96 సెం.మీ. వర్షం
- ఐదు మండలాల్లో భారీ వర్షం
- నెక్కొండలో అత్యధిక వర్షపాతం నమోదు
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- పలు ఇండ్లు ధ్వంసం

నర్సంపేట రూరల్: మత్తడి దుంకుతున్న మగ్దంపురం ఊరచెరువు

ఖిలావరంగల్, ఆగస్టు 31: కొన్ని రోజులుగా మొహం చాటేసిన వరుణుడు కరుణించడంతో రైతులకు ఊరట లభించింది. అయితే, భారీ వర్షాల కారణంగా పలు గ్రామాల్లో పాత, రేకుల షెడ్లు కూలిపోయాయి. జిల్లావ్యాప్తంగా సాధారణం నుంచి భారీ వర్షాలు కురిశాయి. శుక్రవారం సాయంత్రం నుంచి శనివారం ఉదయం వరకు కురిసిన వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా.. పలు చెరువులు మత్తడి దుంకుతున్నాయి. డ్రైనేజీలు చెత్తాచెదారంతో నిండిపోవడంతో వరద నీరు రోడ్లపై ప్రవహించింది. వర్షానికి ఈదురుగాలులు తోడు కావడంతో వృద్ధులు, మహిళలతోపాటు ఉదయం స్కూళ్లకు వెళ్లే విద్యార్థులు, కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు, వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా సగటున 5.96 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. దుగ్గొండిలో 8.82 సెంటీ మీటర్లు, నల్లబెల్లిలో 7.64, ఖానాపురంలో 6.56, చెన్నారావుపేటలో 6.60, నెక్కొండలో 10.17 సెంటీ మీటర్ల భారీ వర్షం కురిసింది. గీసుగొండ, నర్సంపేట, సంగెం, వర్ధన్నపేట, రాయపర్తి, పర్వతగిరి, ఖిలావరంగల్, వరంగల్ మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. రానున్న రెండు రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, రైతులు, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరించింది.

మండలాల వారీగా వివరాలు..

నర్సంపేట/ఖానాపురం/చెన్నారావుపేట/పర్వతగిరి/నల్లబెల్లి/నర్సంపేటరూరల్/గిర్మాజీపేట: నర్సంపేట పట్టణం నుంచి వెళ్తున్న మాదన్నపేట పెద్ద కాల్వ నిండా వరదనీ రు చేరడంతో మున్సిపల్ అధికారులు మరమ్మతులు చేపట్టారు. నర్సంపేటలోని పలు చోట్ల కాల్వకు గండ్లు పడే అవకాశం ఉండడంతో ఎన్టీఆర్‌నగర్ కాలనీలో ముందస్తు చర్యలు చేపట్టారు. రాంనగర్ కాలనీలోనూ ప్రజలను అలర్ట్ చేశారు. ఖానాపురం మండలం పాకాల ఆయకట్టులో పలుచోట్ల పంట పొలాలు నీటమునిగాయి. సంగెం, తుంగబంధం, జాలుబంధం పారకంలోని పంట పొలాల్లోకి వర్షపునీరు చేరింది. మంగళవారిపేట జాతీయ రహదారి నుంచి నాజీతండాకు వెళ్లే రహదారిలో లో లెవల్ కల్వర్టు పై నుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తున్నది. దీంతో కొన్ని గంటలపాటు నాజీతండాకు రాకపోకలు నిలిచిపోయాయి. పాకాల సరస్సులోకి భారీగా వరద నీరు చేరుతున్నది. చెన్నారావుపేట మండలకేంద్రంలోని ఎదురబోయిన కట్టమ్మ ఇంటి పైకప్పుతో సహా కూలింది. జల్లి గ్రామం లో నూనె శంకర్, రాసమళ్ల లచ్చమ్మ, ఊట్ల పుష్పమ్మ, ఆకుతోట మల్లయ్య, ఎండీ రజాక్ ఇళ్లు ధ్వంసమయ్యాయి. పాపయ్యపేటలో, పర్వతగిరి మండలం పెద్దతండాలో వర్షపు నీరు ఇళ్లలోకి వచ్చి ప్రజలు అవస్థలు పడ్డారు. గ్రామాల్లోని చెరువులు, కుంటల్లోకి వరదనీరు చే రింది. నల్లబెల్లి మండలంలో భారీ వర్షం కురిసింది. మండల పరిషత్ కార్యాలయ ఆవరణ వర్షపు నీటితో నిండి చెరువును తలపించింది. ఈ క్రమంలో కార్యాలయాన్ని తనిఖీ చేసేందుకు వచ్చిన జడ్పీ సీఈవో, ఇన్‌చార్జి డీపీవో రాంరెడ్డి నీటితో నిండిన ఆవరణను చూసి ఎంపీడీవో నర్సింహమూర్తిని వివరణ కోరారు. నర్సంపేట మండలం ముగ్దుంపురం ఊరచెరువు మత్తడి దుంకుతున్నది. గురిజాల శివారులోని లో లెవల్ కాజ్‌వే పైనుంచి వరదనీరు ప్రవహిస్తున్నది. గురిజాలలో వరద నీరు ఇండ్లలోకి చేరింది. వరంగల్ బట్టలబజార్‌లోని బాలానగర్ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణలోకి వర్షపు నీరు చేరి జలమయమైంది.

గిర్మాజీపేట: బట్టలబజార్‌లోని బాలానగర్ వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలోకి చేరిన నీరు

పర్వతగిరి: పెద్దతండాలో చెరువును తలపిస్తున్న వర్షపునీరు

నల్లబెల్లి: చెరువును తలపిస్తున్న ఎంపీడీవో కార్యాలయ ఆవరణ

అధికారుల పనితీరు మెరుగుపడాలి

- జడ్పీ సీఈవో రాంరెడ్డి
- కార్యాలయ పరిసరాల అపరిశుభ్రతపై ఆగ్రహం
- నలుగురికి ఒకరోజు వేతనం నిలిపివేత

ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిలిచిన నీటిని తొలగింపజేస్తున్న జడ్పీ సీఈవో రాంరెడ్డి

ఖానాపురం, ఆగస్టు 31: ప్రజలు, కిందిస్థాయి ఉద్యోగులకు జవాబుదారితనంగా వ్యవహరించాల్సిన ఉన్నతాధికారులు నిర్లక్ష్యాన్ని విడనాడి, పనితీరును మెరుగుపర్చుకోవాలని జడ్పీ సీఈవో, ఇన్‌చార్జి డీపీవో రాంరెడ్డి సూచించారు. మండల పరిషత్ కార్యాలయాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, గదులు, పరిసరాలను పరిశీలించారు. కార్యాలయం ఎదుట వర్షపు నీరు నిల్వడంతో దగ్గరుండి సిబ్బందితో తొలగింపజేశారు. నీరు నిలిచినా పట్టించుకోని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అదేవిధంగా తనిఖీ సమయంలో ఎంపీడీవో భారతి, సూపరింటెండెంట్ వెంకటేశ్వర్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ పృథ్వీరాజ్, అటెండర్ చంద్రశేఖర్ విధులకు సకాలంలో హాజరు కాకపోవడంతో వారికి ఒకరోజు వేతనం నిలిపివేశారు. అనంతరం రాంరెడ్డి మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 3.95 లక్షల ఓటర్లు ఉన్నారన్నారు. ఓటరు జాబితా ఆన్‌లైన్ ప్రక్రియ 70 శాతం పూర్తయిందన్నారు. త్వరలోనే వందశాతం పూర్తి చేయనున్నట్లు తెలిపారు. జీపీల్లో ఈ నెల 6న ఓటరు జాబితాను ప్రదర్శిస్తామని, అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలన్నారు. ఫిబ్రవరి వరకు ఓటరు జాబితా టీ ఫోల్ యాప్‌లో నమోదైందని, ఆ తర్వాత నమోదు చేసుకున్న ఓటరు జాబితా కూడా త్వరలోనే నమోదు చేయనున్నట్లు తెలిపారు. పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే వరకు కొత్తవారు ఓటుహక్కు కోసం నమోదు చేసుకోవచ్చన్నారు. గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా ప్రజలు దోమతెరలు వాడాలన్నారు. అధికారుల పనితీరు సరిగా లేదని, ఇప్పటికైనా పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించారు.

త్వరితగతిన మ్యాపింగ్ పూర్తి చేయాలి

నల్లబెల్లి: త్వరితగతిన ఎలక్టరోల్ మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని జడ్పీ సీఈవో రాంరెడ్డి ఆదేశించారు. త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికలను పురస్కరించుకుని ఎంపీడీవో కార్యాలయంలో ఎలక్టరోల్ మ్యాపింగ్ ప్రక్రియపై ఎంపీవో నరసింహమూర్తితోపాటు ఆపరేటన్ రఘువరన్‌తో శనివారం ఆయన సమీక్షించారు. కంప్యూటర్ ఆపరేటర్లు వార్డుల విభజన మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. అనంతరం ప్రజాపాలన దరఖాస్తులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీవో పసరగొండ రవి, సీనియర్ అసిస్టెంట్ శారద, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం

ఖిలావరంగల్/వరంగల్, ఆగస్టు 31: భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ సత్య శారద తెలిపారు. టోల్‌ఫ్రీ నంబర్లు 18004253434, 91 54252936లో సంప్రదించాలన్నారు. అలాగే, బల్దియాలో 18004251980, 9701999645, 9701999676 నంబర్లు ఏర్పాటు చేసినట్లు మేయర్, కమిషనర్ తెలిపారు.

తహసీల్దార్ కార్యాలయల్లో..

పోచమ్మమైదాన్/సంగెం: భారీ వర్షాల నేపథ్యంలో తహసీల్దార్ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్స్ ఏర్పా టు చేస్తున్నారు. వరంగల్ తహసీల్‌లో 18004253424, 7013626828, 9948225160 నంబర్లు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ ఇక్బాల్ తెలిపారు. ఎనుమాముల, ఎస్ఆర్‌నగర్, బాలాజీనగర్, చాకలి ఐలమ్మ నగర్, హంటర్‌రోడ్డులోని సాయి నగర్, ఎన్టీఆర్‌నగర్ వాసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. సంగెం తహసీల్‌లో 18004253424, 9963222137 నంబర్లు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ రాజ్‌కుమార్ తెలిపారు.

సరిపడా యూరియా అందిస్తాం

- ఎంపీడీవో కిషన్‌నాయక్
- సొసైటీ ఆకస్మిక తనిఖీ
- 'నమస్తే తెలంగాణ' ఎఫెక్ట్

మాట్లాడుతున్న ఎంపీడీవో కిషన్‌నాయక్

రాయపర్తి, ఆగస్టు 31: మండలంలోని రైతులందరికీ సకాలంలో, సరిపడా యూరియా బస్తాలు అందిస్తామని ఎంపీడీవో గుగులోత్ కిషన్‌నాయక్ అన్నారు. మండలంలోని 40 గ్రామాల రైతులు యూరియా బస్తాల కోసం పడుతున్న కష్టాలపై శనివారం నమస్తే తెలంగాణలో 'యూరియా కోసం అగచాట్లు' శీర్షిక కథనం ప్రచురితమైంది. స్పందించిన ఎంపీడీవో మండలకేంద్రంలోని సొసైటీ భవనం, గోదాంలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ చైర్మన్ కుందూరు రాంచంద్రారెడ్డి, ఏవో గుమ్మడి వీరభద్రంతో కలిసి సమీక్షించారు. మండలంలోని రైతులందరూ యూరియా బస్తాలు, కూపన్ల కోసం ఒకేసారి రావడంతో రద్దీ పెరగడం వల్ల అటు రైతులు.. ఇటు సొసైటీ సిబ్బంది ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్, సీడ్స్ దుకాణాలపై ఏకకాలంలో సోదాలు జరపాలని, కృత్రిమ కొరత సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకునేలా ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామన్నారు. ఆయన వెంట సొసైటీ డైరెక్టర్ సోమానాయక్, సీఈవో సోమిరెడ్డి, కార్యదర్శి వినోద్‌కుమార్, సొసైటీ సిబ్బంది ఉన్నారు.

తృటిలో తప్పిన ప్రమాదం

పక్కకు ఒరిగిన బస్సు

చెన్నారావుపేట, ఆగస్టు 31: ఆర్టీసీ బస్సుకు తృటిలో పెద్ద ప్రమాదం తప్పింది. శనివారం బోజెర్వు గ్రామం నుంచి నర్సంపేటకు ఆర్టీసీ బస్సు వస్తున్నది. ఈ క్రమంలో జోజిపేట నారాయణతండా వద్ద గాలివానకు రోడ్డుపై చెట్టు కూలింది. డ్రైవర్ చెట్టు పక్క నుంచి బస్సును తప్పించే క్రమంలో బురదలోకి జారింది. డ్రైవర్ అప్రమత్తమై బస్సును నిలిపి ప్రయాణికులను సురక్షితంగా కిందకు దించాడు. అనంతరం ఎస్సై అరుణ్‌కుమార్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని జేసీబీతో బస్సును బయటకు లాగారు.

నైపుణ్యాలు పెంచాలి

వరంగల్ చౌరస్తా, ఆగస్టు 31: ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థుల్లో పోటీతత్వంతోపాటు నైపుణ్యాలు పెంచాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి డాక్టర్ శ్రీధర్ సుమన్ అన్నారు. శనివారం ఆయన యాకుబ్‌పురలోని తెలంగాణ గిరిజన సంక్షేమ బాలుర కళాశాలను సందర్శించారు. అధ్యాపకులకు సూచనలు చేశారు. విద్యార్థులు ఇష్టంగా చదివి ఉన్నతంగా ఎదగాలన్నారు.

రైల్వేస్టేషన్‌లో హెల్ప్‌లైన్-27782751

ఖిలావరంగల్, ఆగస్టు 31: ఆంధ్రప్రదేశ్‌లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా దక్షిణ మధ్య రైల్వే పలు రైళ్లను రద్దు చేసింది. మరికొన్ని రైళ్లను దారి మళ్లించారు. ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగా వరంగల్ రైల్వేస్టేషన్‌లో హెల్ప్‌లైన్ నంబర్ 27782 751ను ఏర్పాటు చేశారు.

బాలికల హాస్టల్ తనిఖీ

కరీమాబాద్, ఆగస్టు 31: ఉర్సుగుట్టలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ బాలిక పాఠశాల, కళాశాలను అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంటశాల, భోజనాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులు, సిబ్బందితో కలిసి భోజనం చేశారు. విద్యార్థులను విషయాలు అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధుల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలన్నారు.

'బండ్'ను అభివృద్ధి చేయాలి

గిర్మాజీపేట, ఆగస్టు 31: భద్రకాళీ బండ్ అభివృద్ధిపై దృష్టి సారించాలని బండ్ ఏరియా కమిటీ అధ్యక్షుడు మర్రి రవీందర్ కోరారు. ఈ మేరకు కమిటీ సభ్యులు శనివారం రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు.

నిరసన చేస్తున్న ఏఐపీకేఎస్ నాయకులు

'షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి'

ఖిలావరంగల్, ఆగస్టు 31: ఎలాంటి షరతులు లేకుండా రైతులకు రూ. 2 లక్షల వరకు రుణమాఫీ చేయాలని ఏఐపీకేఎస్ కార్యదర్శి సైరి డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట శనివారం నిరసన తెలిపి అదనపు కలెక్టర్ సంధ్యారాణికి వినతిపత్రం అందజేశారు. ఎన్నికల ముందు రైతంగానికి సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని సూచించారు. రుణం మాఫీ కాక, కొత్త రుణాలు మంజూరు చేయకపోవడంతో రైతులు బ్యాంకులు, వ్యవసాయ శాఖ కార్యాలయాల వద్ద పడిగాపులు కాస్తున్నారని ప్రభుత్వాన్ని విమర్శించారు. జిల్లా అధ్యక్షుడు మైదం పాణి, అర్షం సుధాకర్, జీ రవి పాల్గొన్నారు.

40 దరఖాస్తుల స్వీకరణ

ఖానాపురం : మండలకేంద్రంలో శనివారం 40మంది రుణమాఫీ కాని రైతుల నుంచి వ్యవసాయాధికారులు దరఖాస్తులు స్వీకరించారు. వీటిని ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు ఏఈవో నాగరాణి తెలిపారు.

మార్కెట్ కార్యాలయాన్ని పరిశీలించిన 'దొంతి'

నర్సంపేట, ఆగస్టు 31: శిథిలావస్థలో ఉన్న తహసీల్దార్ కార్యాలయాన్ని వ్యవసాయ మార్కెట్ ఆవరణలోకి మార్చేందుకు భవనాన్ని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి శనివారం పరిశీలించారు. వర్షాలకు భవనం మొత్తం ఉరుస్తున్నది. దీంతో కార్యాలయాన్ని తాత్కాలికంగా మరోచోటుకు మార్చేందుకు భవనాలను పరిశీలించారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్ ఉన్నారు.

శివాలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన

సంగెం, ఆగస్టు 31: గవిచర్లలోని శివాలయ పునర్నిర్మాణానికి పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి శనివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా గుండబ్రహ్మయ్య ఆలయానికి వచ్చిన ప్రకాశ్‌రెడ్డికి అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భూమి చేశారు. అనంతరం కాట్రపల్లిలో ప్రతిష్ఠించిన పోచమ్మ, అభయాంజనేయస్వామి ఆలయాలను సందర్శించున్నారు. కార్యక్రమంలో కూడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి, మాజీ జడ్పీటీసీ సుదర్శన్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఆమరణ నిరాహార దీక్ష భగ్నం

- అర్ధరాత్రి వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించిన పోలీసులు
- చావుకైనా సిద్ధం.. ప్రభుత్వం స్పందించాలి
- రజక రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కుమారస్వామి

కుమారస్వామిని ఎంజీఎంహెచ్‌కు తరలిస్తున్న పోలీసులు

గీసుగొండ, ఆగస్టు 31: బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఏడు రోజులుగా మండలకేంద్రంలోని తన నివాసంలో బీసీ నాయకుడు, రజక రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు చాపర్తి కుమారస్వామి చేస్తున్న ఆమరణ నిరాహార దీక్షను శుక్రవారం అర్ధరాత్రి సీఐ బాబులాల్ ఆధ్వర్యంలో పోలీసులు భగ్నం చేశారు. అనంతరం అతడిని పోలీసు వాహనంలో వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు. అయితే, వైద్య సేవలకు సహకరించకుండా దీక్షను కొనసాగిస్తానని అతడు స్పష్టం చేశారు. చావుతోనైనా సిద్ధమని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే డిక్లరేషన్‌పై స్పందించాలని డిమాండ్ చేశారు. బీసీలు ఎకం కావాలని పిలుపునిచ్చారు. ఎంజీఎంహెచ్‌లో బీసీ సంఘాల నాయకులు కుమారస్వామికి సంఘీభావం తెలిపారు.

'ప్రాణాలతో చెలగాటమాడొద్దు'

రాయపర్తి, ఆగస్టు 31: లాభాపేక్ష కోసం ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడొద్దని వర్ధన్నపేట డిప్యూడీ డీఎంహెచ్‌వో డాక్టర్ గోపాల్‌రావు హెచ్చరించారు. శనివారం ఆయన మండలకేంద్రంలోని మెడికల్ షాపులు, ఆర్ఎంపీ, పీఎంపీలు నిర్వహిస్తున్న క్లినిక్‌లపై తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మెడికల్ షాపుల లైసెన్స్‌లు, మందుల నిల్వలను పరిశీలించి సూచనలు చేశారు. అలాగే, గ్రామీణ వైద్యులకు సలహాలు, సూచనలు అందించారు. ఆయన వెంట జిల్లా వైద్య ఆరోగ్య శాఖ మాస్ మీడియా అధికారి ఈదురు అనిల్‌కుమార్, డాక్టర్ యాసం వనజ ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కరీమాబాద్, ఆగస్టు 31: సీజనల్ వ్యాధులపై ప్రజలు ప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ సూచించారు. ఉర్సుగుట్టలో డెంగ్యూ సోకిన వారి ఇంటిని శనివారం పరిశీలించారు. వైద్య సిబ్బంది నిత్యం పర్యవేక్షిస్తూ జ్వర పరీక్షలు చేపట్టి నివేదిక ఇవ్వాలని ఆయన సూచించారు.

శ్రీనివాస్ కుటుంబానికి బండా ప్రకాశ్ పరామర్శ

పోచమ్మమైదాన్, ఆగస్టు 31: వరంగల్ 23వ డివిజన్ కొత్తవాడ మాజీ కార్పొరేటర్ యెలగం శ్రీనివాస్ కుటుంబాన్ని తెలంగాణ రాష్ట్ర శాసనమండలి ఉపాధ్యక్షుడు డాక్టర్ బండా ప్రకాశ్ శనివారం పరామర్శించారు. అలాగే, శ్రీనివాస్ జ్ఞాపకార్థం కొత్తవాడలోని ఓం అయ్యప్ప భక్త మండలి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

బాధిత కుటుంబాలకు నన్నపునేని పరామర్శ

కరీమాబాద్: మృతుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న నన్నపునేని నరేందర్

కరీమాబాద్/పోచమ్మమైదాన్, ఆగస్టు 31: అండర్ రైల్వేగేట్ ప్రాంతంలోని ఎస్ఆర్ఆర్‌తోట, లక్ష్మీనగర్‌లో ఇటీవల మరణించిన వారి కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు పొగాకు సందీప్, నాయకుడు బజ్జూరి వాసు ఉన్నారు. అలాగే, తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ 23వ డివిజన్ నాయకుడు కర్ణకంటి కుమార్‌ను నన్నపునేని పరామర్శించారు. ఆయన అనారోగ్యానికి గురికాగా, కొత్తవాడలోని కుమార్ ఇంటికి వెళ్లి యోగక్షేమాలు తెలుసుకున్నారు. అలాగే, కుమార్ పుట్టిన రోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

నాణ్యమైన భోజనం అందించాలి

- మెనూ పాటించకపోతే చర్యలు
- కలెక్టర్ సత్య శారద
- మధ్యాహ్న భోజనం శాంపిల్స్ సేకరణ
- హెచ్ఎం, అంగన్‌వాడీ టీచర్‌కు షోకాజ్ నోటీసులు
- కేజీబీవీ, సర్కారు బడులు, అంగన్‌వాడీ కేంద్రాలు, హెల్త్ సబ్‌సెంటర్ తనిఖీ

అశోక్‌నగర్ కేజీబీవీలో కూరగాయలను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్య శారద

ఖిలావరంగల్: కలెక్టరేట్‌లో సమీక్షిస్తున్న కలెక్టర్

ఖానాపురం, ఆగస్టు 31: విద్యార్థులకు రుచి, శుచితో కూడిన నాణ్యమైన భోజనం అందించాలని కలెక్టర్ సత్య శారద ఆదేశించారు. అశోక్‌నగర్‌లోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం, ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, హెల్త్ సబ్‌సెంటర్‌ను శనివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా కేజీబీవీకి వెళ్లి వంట, తరగతి గదులు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. దోమల నివారణకు ఏం చర్యలు చేపట్టారని కలెక్టర్ ఎస్‌వో మేనకను అడగగా.. మస్కిటో కాయిల్స్ పెడుతున్నామని చెప్పారు. వాటిని చూపించాలని కోరడంతో సమాధానం చెప్పలేదు. దీంతో ఆమెపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. పాఠశాల ఆవరణలో ఫిర్యాదుల బాక్స్ ఏర్పాటు చేస్తున్నామని, ఇకపై విద్యార్థినులకు ఏమైనా సమస్యలుంటే పేపర్‌పై రాసి బాక్స్‌లో వేయాలని సూచించారు. తర్వాత అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి పిల్లలతో మాట్లాడారు. ఆట వస్తువులు అందించాలని సూచించారు. బావి నీళ్లతో కాకుండా భగీరథ నీటితో వంట చేయాలన్నారు. అక్కడి నుంచి హైస్కూల్, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ సెంటర్‌కు వెళ్లి తనిఖీ చేశారు.

ఆవరణ బురదయమం..

హైస్కూల్ ఆవరణ బురదమయంగా ఉండడంతో హెచ్ఎంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. ఓ విద్యార్థి మధ్యాహ్నం భోజనం సరిగా ఉండడం లేదని, ఉపాధ్యాయులు సక్రమంగా పాఠశాలకు రావడం లేదని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కలెక్టర్ విద్యార్థిని అభినందించారు. ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనానికి ఉపయోగించే సరుకుల నుంచి దుర్వాసన వస్తుండడం, శుభ్రత లేకపోవడంతో హెచ్ఎం నర్సింహంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సరుకులు తక్కువగా ఉండడంతో హెచ్ఎంకు షోకాజ్ నోటీసు జారీ చేశారు. పక్కనే ఉన్న అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి భోజనం తయారీలో మెనూ ప్రకారం మునగకాయ ఉండాలని అడుగగా, ఉందని అంగన్‌వాడీ టీచర్ సమాధానం చెప్పారు. కూరను పరిశీలించగా అందులో మునగకాయ లేకపోవడం, విద్యార్థుల సంఖ్య ఎందుకు తక్కువగా ఉందని అడుగగా.. వర్షం పడిందని పొంతనలేని సమాధానం చెప్పడంతో ఆమెకు షోకాజ్ నోటీసు అందజేశారు. అనంతరం పల్లె దవాఖానను పరిశీలించారు. సిబ్బంది విధులకు సక్రమంగా హాజరు కావాలన్నారు. వర్షానికి భవనం కురుస్తున్నదని సిబ్బంది చెప్పడంతో నివేదిక తయారు చేసి తనకు అందజేయాలని తహసీల్దార్ కిరణ్‌కుమార్‌ను ఆదేశించారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో తయారు చేసిన, చేయక ముందు కూరగాయల షాంపిల్స్‌ను సేకరించి ఫుడ్‌సేఫ్టీ అధికారులకు పంపుతున్నట్లు తెలిపారు. గతంలో తనిఖీలు ఎక్కువగా లేనందున వ్యవస్థాగతంగా నిర్లక్ష్యం ఉందని, ఇకపై తరచూ తనిఖీలు చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ సత్యనారాయణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మత్తు పదార్థాల నియంత్రణకు చర్యలు

ఖిలావరంగల్: జిల్లాలో గంజాయి, మాదక ద్రవ్యాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఆమె డీసీపీ రవీందర్‌తో కలిసి సమీక్షించారు. యువత చెడు వ్యసనాలకు అలవాటు పడితే వారిని గుర్తించి తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వాలన్నారు. రోడ్డు, రైలు మార్గాల ద్వారా గంజాయి దిగుమతయ్యే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. పోలీసులు రైల్వేస్టేషన్, బస్టాండ్‌లో నిఘా పెట్టాలన్నారు. గంజాయి స్మగ్లింగ్ లేదా అలవాటు పడిన వ్యక్తులు కనిపిస్తే టోల్‌ఫ్రీ నంబర్ 8712661111కు ఫిర్యాదు చేయాలన్నారు. సమీక్షలో నర్సంపేట ఏసీపీ కిరణ్‌కుమార్, డీఎంహెచ్‌వో వెంకటరమణ, అసిస్టెంట్ ఎక్సైజ్ అధికారి మురళి, ఎఫ్ఆర్‌వో సందీప్, డ్రగ్ కంట్రోల్ ఇన్‌స్పెక్టర్ అరవింద్‌కుమార్‌రెడ్డి, డీడబ్ల్యూవో హైమావతి పాల్గొన్నారు.

ఊకల్‌లో ఎరువుల కేంద్రం తనిఖీ

గీసుగొండ: ఊకల్ రైతు సహకార సంఘం ఆధ్వర్యంలోని ఎరువుల విక్రయ కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ఎరువుల స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. యూరియా లేదని తెలుసుకొని సీఈవో రమేశ్‌ను మందలించారు. డీసీవోకు ఫోన్ చేసి యూరియా స్టాక్ ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. రుణమాఫీ కాని రైతుల వివరాలు సేకరిస్తున్నరా అని అడిగి తెలుసుకున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సెప్టిక్ ట్యాంక్ క్లినర్

SepTeK

★ సెప్టిక్ ట్యాంక్ క్లినర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.
NTW-